ప్రజాశక్తి

సోమవారం 28 అక్టోబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# ఇదేం సంప్రదాయం..?



పరిశ్రమల ప్రతినిధులకు జ్ఞాపికలు ఇస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ (ఫైల్ ఫొటో)

- డబ్బులిచ్చిన వారికి సన్మానాలు
- భూములిచ్చిన రైతులు రోడ్లపాలు
- అభిజిత్ కార్మికుల గోడు పట్టించుకోని అధికారులు
- కొత్త ఒరవడికి తెరలేపిన ప్రభుత్వ యంత్రాంగం
- అధికార పార్టీ నాయకులను సంతృప్తిపరిచే పని

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం కొత్త ఒరవడికి తెరలేపింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సిఎస్ఆర్) కింద డబ్బులిచ్చిన యాజమాన్య ప్రతినిధులను సన్మానించి సంతృప్తిపర్చే కార్యానికి ఒడిగట్టింది. మంచి పనులు చేసే వారిని ప్రోత్సహించడం సత్సంప్రదాయమైనా, పరిశ్రమల కాలుష్యంతో భరించలేని ప్రజలను వదిలేసి కొద్దిమంది రాజకీయ నాయకులను సంతృప్తిపర్చే పనికి అలవాటుపడ్డ వారిని ప్రభుత్వ యంత్రాంగం సన్మానించడం విమర్శలకు తావిస్తోంది. కాలుష్య బాధిత ప్రజలను విస్మరిస్తున్న పరిశ్రమాధిపతులను సన్మానించి.. జిల్లా ఆర్థికాభివృద్ధికి పరిశ్రమలు కీలకమని చెబుతూ, ఎటువంటి సహకారం కావాలన్నా నేరుగా సంప్రదించవచ్చని కంపెనీ ప్రతినిధులకు కలెక్టర్ విజయకృష్ణన్ భరోసా ఇవ్వడం విస్తుగొలుపుతోంది. సామాజిక బాధ్యతగా ఇవ్వాల్సిన నిధులను దయతో కంపెనీలు ఇస్తున్నట్లు అధికారులు భావిస్తున్నట్లుంది.

సిఎస్ఆర్ కింద డబ్బులిచ్చిన కంపెనీ ప్రతినిధులకు ధైర్యమిచ్చిన కలెక్టర్‌కు పరిశ్రమలకు భూములిచ్చి ఉపాధిలేని, కాలుష్యంతో నిరంతరం బాధపడుతున్న నిరాశ్రయులు గుర్తుకువచ్చినట్లులేదు. నిధులిస్తే మీ జోలికి రామన్న సంకేతాలు ఇచ్చినట్లన్పించింది. చట్టవిరుద్ధంగా లే ఆఫ్ ప్రకటించి వెయ్యి మంది కార్మికులను ఉన్నపలానా వీధినపడేసిన అభిజిత్ యాజమాన్యంపై కనీస చర్యలు లేవు. తమ పరిధిలో చేయాల్సిన, తీసుకోవాల్సిన చర్యలకు కూడా కలెక్టర్ సిద్ధపడ్డంలేదు. 17 ప్రాణాలను బలితీసుకొని, 38 మంది మిగతా 2లో..



కార్యాలయ ప్రారంభంలో లోకనాథం, జగ్గునాయుడు, కుమార్, మూర్తి తదితరులు

# కార్మిక వర్గానికి అండ.. సిఐటియు జెండా

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం వార్త 4లో..

## ఘనంగా జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖ జిల్లా చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సాగాయి. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ స్కూళ్లకు చెందిన 318 మంది విద్యార్థులు, ఆయా స్కూళ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ,ప్రొఫెసర్ పద్మ ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. చెకుముకి ప్రాధాన్యతను, శాస్త్ర విజ్ఞాన సంబంధిత విషయాలను వివరించారు. జన విజ్ఞాన వేదిక మిగతా 2లో..

## సాగర తీరంలో 'విక్టరీ ఎట్ సీ' లేజర్ షో

▶ వార్త మెయిన్‌లో..

## ఉక్కు కార్మికులకు జీతాలివ్వకుండా.. ఆంక్షలా.. ?

▶ వార్త 2లో..

## తీరంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

▶ వార్త 8లో..




బోర్డింగ్ పాస్‌ను అందజేస్తున్న మంత్రి రామ్మోహన్ నాయుడు

# ప్రజలకు చేరువగా విమాన సేవలు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వార్త మెయిన్‌లో..

# అక్రమ మద్యం అమ్మకాలపై నిఘా

**'ప్రజాశక్తి'తో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్**

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి**

'జిల్లాలో ప్రభుత్వ లైసెన్సు లేకుండా మద్యం విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం. అనుమతుల్లేని ప్రాంతాల్లో ప్రయివేటు షాపుల్లో మద్యం అమ్మకూడదు. నవంబరు ఒకటి నుంచి ప్రత్యేకంగా ఈ తరహా అమ్మకాలపై నిఘాపెట్టి నియంత్రిస్తాం. షాపుల ఏర్పాటులో ఎక్కడైనా సమస్యలుంటే సరిచేస్తాం' అని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్ తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ప్రభుత్వ మద్యం షాపుల లైసెన్సులు, అమ్మకాలకు తీసుకున్న చర్యలను వివరించారు. ప్రధానాంశాలు ఆయన మాటల్లోనే..

**జిల్లాలో ఎన్ని మద్యం షాపులకు ప్రభుత్వ లైసెన్సులున్నాయి ?**

జిల్లాలో 136 ప్రయివేటు మద్యం షాపులకు లైసెన్సులున్నాయి. లైసెన్సు పొందిన వారు షాపులు ఏర్పాటుచేసి విక్రయాలు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే మద్యం అమ్మాలి.

**గ్రామీణ ప్రాంతాల్లో మద్యం అమ్మకాల నియంత్రణకు తీసుకొనే చర్యలేంటి ?**

ప్రభుత్వ లైసెన్సుల్లేకుండా మద్యం అమ్మకూడదు. అలా అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటాం. నవంబరు ఒకటి నుంచి ప్రత్యేకంగా నిఘాపెట్టి




పరిశీలిస్తాం. ఎక్కడైనా చట్ట విరుద్ధంగా మద్యం విక్రయించి పట్టుబడితే చట్టపరమైన చర్యలుంటాయి.



**మద్యం షాపుల దరఖాస్తుల ద్వారా వచ్చిన ఆదాయమెంత ?**

ప్రభుత్వ లైసెన్సుల కోసం వ్యాపారులు చేసుకున్న దరఖాస్తు ద్వారా ప్రభుత్వానికి రూ.66 కోట్ల ఆదాయం వచ్చింది. మద్యం అమ్మకాల మిగతా 2లో..

# ఉక్కు కార్మికులకు జీతాలివ్వకుండా.. ఆంక్షలా.. ?

## ప్లాంట్‌ను ముంచేసే చర్యలను కేంద్రం వెంటనే నిలిపివేయాలి
## సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు




మాట్లాడుతున్న జగ్గునాయుడు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** కేంద్ర బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు ఇవ్వకుండా యాజమాన్యానికి ఆంక్షలు విధించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తీవ్రంగా వ్యతిరేకించారు. జగదాంబ జంక్షన్ దరి నండూరి ప్రసాదరావు భవనంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆఫీసర్లకు, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలివ్వకుండా ఆర్థికంగా దెబ్బతీసే కుట్రలను కేంద్ర బిజెపి ప్రభుత్వం చేపట్టడం దుర్మార్గమన్నారు. ఉద్యోగులు, కార్మికులు వారంతటవారే ఉద్యోగం వదిలిపోయేలా చేసి ప్లాంట్‌ను ముంచేసే కుట్రలకు మోడీ సర్కారు పూనుకుందన్నారు. ఈ కుట్రలను వెంటనే విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో జీతాలు ఆఫీసర్లకు, పర్మినెంట్ కార్మికులకు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా అందేవన్నారు. దీపావళి పండగ వచ్చినా నేటికీ ప్రస్తుతం జీతాలు లేవన్నారు. నాడు దసరా పండగకు బోనస్ రూ.26 వేలు వచ్చేదని, వాటినీ నేడు చెల్లించలేదని అన్నారు. హెచ్ఆర్ఎ రూ.7 వేల మందికి కటింగ్ చేశారన్నారు. 5,500 కుటుంబాలకు కరెంటు ఛార్జీలు భారీగా పెంచారన్నారు. కాంట్రాక్టు కార్మికులకు, హోం గార్డులకు, సెక్యూరిటీ గార్డులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. జీతాలు, హెచ్ఆర్ఎ బోనస్ ఇవ్వడానికి స్టీల్‌ప్లాంట్ వద్ద డబ్బులు లేక కాదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు వస్తున్న ఆదాయాన్ని రూ.440 కోట్లు ఫిక్సిడ్ డిపాజిట్లు చేశారని, రూ.70 కోట్లు ఖాతాలో ఉన్నాయని అన్నారు. డబ్బులు ఉండి కూడా జీతాలు చెల్లించటం లేదని ఆయన విమర్శించారు. స్టీల్ మినిస్టరీ నుండి ఆదేశాలు వచ్చాయి గనుక చెల్లించడం లేదని స్పష్టంగా యాజమాన్యమే చెబుతోందని, ఇది చాలా దుర్మార్గమని అన్నారు. సంస్థ ఉత్పత్తిలో భాగస్వాములైన ఆఫీసర్లకు, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఆపాలని చెప్పడమంటే ప్లాంట్‌ను దెబ్బతీసే చర్చే అవుతుందని అన్నారు. కేవలం కార్మికులను ఆర్థికంగా బలహీనపరిస్తే వారంతటవారే బయటకు పోతారని భావించి ప్రభుత్వం పెట్టిన విఆర్ఎస్ పథకాన్ని సులువుగా అమలు చేయొచ్చన్న కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోందన్నారు. కాంట్రాక్టు కాలం పూర్తయిన కాంట్రాక్టులను రెన్యువల్ చేయకుండా సుమారు 900 మంది కాంటాక్ట్ కార్మికులను బయట పెట్టారని చెప్పారు. 50 సంవత్సరాల వయస్సు దాటిన వారిని మెడికల్ అన్ ఫిట్ పేరుతో బయటకు పంపే కుయుక్తులు పన్నారని తెలిపారు. ఉద్యోగులను, కార్మికులను భారీగా తగ్గించి తమకు అనుకూలంగా ఉన్న కార్పొరేట్ సంస్థలకు స్టీల్‌ప్లాంట్‌ను అప్పగించే బిజెపి కుట్ర స్పష్టంగా అర్థమవుతోందన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను అభివృద్ధి బాట, లాభాలు బాటపట్టిస్తామని చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు చెబుతున్నారని, కానీ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి చర్యలు తాబేలు నడకలా వుంటే ప్లాంట్‌ను ముంచేసే చర్యలు రాకెట్ వేగంతో ఉన్నాయని దుయ్యబట్టారు. బిజెపి చర్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విశాఖ ఎంపీ శ్రీభరత్, గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌లు తక్షణమే నిలువరించాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా నష్టం జరగకముందే వారు స్పందించాలని, కేంద్రం ముంచేసేక స్పందించినా ప్రయోజనం ఉండదని తెలిపారు. తక్షణమే ఆఫీసర్ల, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల జీతభత్యాలు అమలు చేయించాలని, సెయిల్‌లో విలీనం చేయించాలని. లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు, సీనియర్ నాయకులు ఎం.సూరీడు పాల్గొన్నారు.

## తోపుడు బండ్ల కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించాలి

**ప్రజాశక్తి,-ఎంవిపి కాలనీ :** చిన్న వాల్తేర్ కోటక్ స్కూల్ వద్ద తొలగించిన తోపుడుబండ్లను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉదయం చిన్న వాల్తేర్ మానసిక హాస్పిటల్ జంక్షన్ నుంచి వామన జంక్షన్ మీదుగా రైల్వే గెస్ట్ హౌస్ సెంటర్ వరకు సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఉపాధి రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం మానసిక హాస్పిటల్ జంక్షన్ వద్ద నిర్వహించిన సభలో విశాఖపట్నం తోపుడు బండ్లు, చిల్లర వర్తక కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే తోపుడు బండ్లు కార్మికులపై దాడులు పెరిగాయన్నారు. ట్విట్టర్ కంప్లైంట్ ద్వారా తోపుడు బండ్లను జివిఎంసి కమిషనర్ తొలగించడం అన్యాయమన్నారు. నగరంలో అనేక చోట్ల అమూల్ బడ్డీలు ఉండగా చిన్న చిన్న తోపుడుబండ్లే మీకు కనిపించాయా అని ప్రశ్నించారు. సిఐటియు సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు మాట్లాడుతూ, రెక్కాడితే గాని డొక్కాడని కార్మికులపై దాడులు చేయడం అన్యాయమన్నారు. సిఐటియు మద్దిలపాలెం జోన్ నాయకులు కె.కుమారి మాట్లాడుతూ తోపుడుబండ్లను యథావిధిగా కొనసాగించకపోతే జివిఎంసి ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి, తోపుడు బండ్లు సంఘం గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు, ఎ.అప్పారావు, కెఎన్.గణేష్, కె.రాజు, సుమారు 50 మంది తోపుడుబండ్ల కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా సిస్టర్ నివేదిత జయంతి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** జివిఎంసి 39వ వార్డులోని శ్రీ స్వామి వివేకానంద సంస్థలో స్వామి వివేకానంద శిష్యులు సిస్టర్ నివేదిత జయంతిని 27, 28, 29 తేదీలలో నిర్వహించనున్నారు. మొదటి రోజు ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువజన నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని నివేదిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిస్టర్ నివేదిత వివేకానందుడి బోధనలకు ప్రభావితమైన మొదటి విదేశీ మహిళ అన్నారు. మహిళా విద్యాభివృద్ధి కోసం ఆమె ఎంతో కృషి చేశారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పుండరీకాక్షయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పోషకాహారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆహార రంగ నిపుణులు, న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ లీల కృష్ణస్వామి సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ఆహారం అనే అంశంపై బీచ్ రోడ్‌లోని ఓ హోటల్‌లో జరిగిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడుతూ వేడుకల సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై దృష్టి సారించాలన్నారు. బరువు పెరగడం, రక్తంలో చక్కెర పెరుగుదలను నివారించేందుకు తీసుకునే ఆహారం పట్ల అందరూ జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా తృణధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, బాదం తరహా గింజలు ఆరోగ్యానికి మంచివని తెలిపారు. బాదంపప్పులో ప్రోటీన్, కాల్షియం, జింక్, డైటరీ ఫైబర్, మెగ్నీషియం వంటి 15 ముఖ్యమైన పోషకాలు ఉన్నాయన్నారు. ఈ సదస్సులో డైటెటిక్స్ హెడ్ రితికా సమద్దర్, ఫిట్‌నెస్ కోచ్ డాక్టర్ రోహిణి పాటిల్, డాక్టర్ మధుమిత కృష్ణన్ పాల్గొన్నారు. వారూ పలు ఆరోగ్య సూచనలు చేశారు. రోజువారీ నియమాలు పాటించాలని కోరారు.





## మొదటి పేజీ తరువాయి..

### ఇదేం సంప్రదాయం..?

గాయపడ్డానికి కారణమైన అసెన్షియా కంపెనీ యాజమాన్యంపై ఇంతవరకు కఠిన చర్యలేవీ తీసుకోలేదు. నలుగురు కార్మికుల ప్రాణాలు తీసిన సినర్జిన్ కంపెనీ యాజమాన్యంపై తీసుకున్న చర్యలు నామమాత్రమే. అసెన్షియా రూ.5 లక్షలు, కనీస కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించని ర్యాంకీ ఫార్మాసిటీ పది లక్షల రూపాయలు, ఇలా పలు కంపెనీల నుంచి విజయవాడ వరద విరాళాలు ప్రభుత్వానికి అందించాయి. వాస్తవానికి జిల్లాలోని పరిశ్రమల నుంచి ఎంత మొత్తంలో సిఎస్ఆర్ నిధులు రావాల్సివుంది.. ? నిబంధనల ప్రకారం సామాజిక బాధ్యత కింద నిధులు కేటాయిస్తున్నారా ? లేదా ? అనే పర్యవేక్షణ సరిగాలేక యజమానులు వారిష్టానుసారం వినియోగిస్తున్నారు. సిఎస్ఆర్ నిధులను తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన, పర్యావరణ పరిరక్షణ వంటి పలు కార్యక్రమాలకు వినియోగించాల్సివుంది. కానీ అధికార పార్టీ నాయకులు కొంతకాలంగా ప్రభుత్వం నుంచి చేయాల్సిన పనులను సిఎస్ఆర్ నిధులతో చేయించడంతో వాటి ప్రయోజనం పక్కదారిపడుతోంది.

కంపెనీ నికర పెట్టుబడి విలువ రూ.500 కోట్లు, అంతకు మించి, వెయ్యి కోట్లు, అంతకుపైగా టర్నోవర్ కలిగి, ఏడాదికి నికర లాభం ఐదు కోట్లు కలిగిన కంపెనీలు రెండు శాతం సిఎస్ఆర్ కింద నిధులు ఇవ్వాల్సివుందని అధికారి ఒకరు తెలిపారు. ఈ తరహా పరిశ్రమలను గుర్తించి, నిధులు వచ్చే పని సరిగా చేయకపోవడంతో నచ్చినట్లు యాజమాన్యాలు ఖర్చు పెట్టి సిఎస్ఆర్ కింద చూపిస్తున్నాయన్న విమర్శలున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రతిపాదిత పనులకు ఇస్తున్న ప్రాధాన్యత తీవ్రమైన సమస్యల పరిష్కారానికి సిఎస్ఆర్ నిధులను అధికారులు వినియోగించడంలేదు. నక్కపల్లిలో ఎస్సి బాలుర వసతి గృహంలో విద్యార్థులు తాగునీరు, కరెంట్, మరుగుదొడ్లు లేక అనేక అవస్థలు పడుతున్నా అధికారులకు పట్టడంలేదు. భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఉపాధి, నివాసిత ప్రాంతాల్లో తాగునీరు, విద్య, వైద్యం వంటి వాటిపై శ్రద్ధ చూపకుండా కంపెనీ ప్రతినిధులను సన్మానించడం తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లయింది. జిల్లాలో రెడ్ కేటగిరి పరిశ్రమలు 224, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలు 29 వున్నాయి. ఈ పరిశ్రమల్లో కార్మికుల భద్రత, రక్షణ పరికరాలు సరఫరా, పర్యావరణ పరిరక్షణ ప్రమాణాల అమలుపై సమీక్షించాల్సిన అధికార యంత్రాంగం సన్మానాలతో మురిపించే పనిలో వున్నట్లు కనబడుతోంది. సిఎస్ఆర్ పరిధిలోకి వచ్చే కంపెనీలను గుర్తించి, వాటి నుంచి నిధులు రాబట్టి నిబంధనల ప్రకారం వినియోగించేపని ఇప్పటికైనా ప్రారంభించాలని ప్రజలు, నిర్వాసిత కుటుంబాలవారు కోరుతున్నారు.

### అక్రమ మద్యం అమ్మకాలపై నిఘా

ఆదాయ లక్ష్యాల్లేవు. విచ్చలవిడిగా మద్యం అమ్మకూడదు. అనుమతి పొందిన షాపుల నుంచి కొనుగోలు చేయాలి.

**నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా షాపులు ఏర్పాటు చేశారా ?**

షాపుల ఏర్పాటులో పెద్దగా ఫిర్యాదుల్లేవు. నిబంధనల ప్రకారమే మద్యం షాపులున్నాయి. రెండుచోట్ల ఫిర్యాదులొచ్చాయి. వాటిని పరిశీలించి సరిచేస్తాం. విద్యా సంస్థలు, దేవాలయాలకు సమీపంలో షాపులు పెట్టకూడదు.




విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, జెవివి నాయకులు

### ఘనంగా జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

జిల్లా నాయకులు ఎస్‌వికె.పరశురాం, కె.శేషగిరిరావు, కె.మురళీధర్, కె.కొండలరావు ఈ కార్యక్రమ నిర్వహణలో ప్రధాన పాత్ర వహించారు. రామ్‌నాథ్ సెకండరీ స్కూల్, నడుపూరు జెడ్‌పి హైస్కూల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని నిర్వాహకులు తెలిపారు.

### విశాఖ వ్యాపార విస్తరణకు అనుకూలం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** టైప్ 2 నగరాల్లో ఒకటైన విశాఖపట్నం వ్యాపార విస్తరణకు ఎంతో అనుకూలమైనదని బిగ్ బాస్కెట్ రిటైల్ మార్కెటింగ్ హెడ్ రాగాలీన శ్రీపాద అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. విశాఖపట్నం లాంటి టైర్ 2 మార్కెట్లు తమకు చాలా ముఖ్యమైనవన్నారు. టైర్ 2 నగరాల్లో ఉండే కస్టమర్‌కు 10 నిమిషాల్లో డెలివరీ చేయబడిన విస్తృత శ్రేణి ఉత్పత్తుల పట్ల వారు చూపుతున్న ఉత్సాహాన్ని చూసి సంతోషంగా ఉందన్నారు. ఈ దీపావళికి బంగారం, వెండి నాణేలు, హోమ్ డెకర్, డ్రై ఫ్రూట్స్, గిఫ్టింగ్ శ్రేణి సహా దీపావళికి అవసరమైన అన్ని వస్తువులను 10 నిమిషాలలో ఇంటి వద్దకు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

### శారదా పీఠంపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వం శారదా పీఠంపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జన జాగరణ సమితి ఆధ్వర్యాన కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. సమితి రాష్ట్ర కన్వీనర్ కె.వాసు, తదితరులు పాల్గొన్నారు.

# రాళ్లు తేలిన రహదారులు



రాళ్లు తేలిన కెజిబివి రోడ్డు

## ప్రజల అవస్థలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో పలు రోడ్లు రాళ్లు తేలి ఉండడంతో అటుగా రాక పోకలు సాగించే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఒకటో వార్డు పరిధిలో తగరపువలస జంక్షన్ నుంచి కొండపేటకు వెళ్లే రహదారిపై రాళ్లు తేలి ఉన్నాయి. ఆపై అడుగడుగునా గుంతలయ్యాయి. సంబంధిత రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయంలో కొండపేట మీదుగా పంప్ హౌస్ వరకు తాగునీటి సరఫరా నిమిత్తం పైపులైన్‌ను పునరుద్ద రించారు. ఇందు నిమిత్తం రోడ్డును ఓ వైపు తవ్వారు. ఓ వైపు తవ్వేసిన రోడ్డును అలానే వదిలేశారు. రోడ్డు తవ్వి దాదాపు ఏడాది కావస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రోడ్డు పునర్నిర్మాణానికి నోచుకోలేదు.

**కెజిబివికి వెళ్లే దారిలో...**

జివిఎంసి మూడో వార్డు పరిధిలో కస్తూరిబా గాంధీ విద్యాలయం (కెజిబివి)కి వెళ్లే రహదారిపై రాళ్లు తేలి ఉన్నాయి. అడుగడుగునా ఇదే పరిస్థితి ఉండడంతో కెజిబివికి వెళ్లేందుకు విద్యార్థినులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

### అంచనాలు రూపొందిస్తున్నాం

పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నట్లు తమ దృష్టికి వచ్చాయి. వీటిని మరమ్మతులు చేయడమా, పునర్నిర్మించడ మా అనేది ఇంజినీర్లు పరిశీలిస్తారు. అందుకు తగ్గట్టుగా నిధులు ఏ మేరకు అవసరమనేది అంచనాలు తయారు చేస్తాం. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడతాం.



**పిల్లి ప్రేమ ప్రసన్న వాణి**
**జోనల్ కమిషనర్**
**భీమిలి**

# నేరాలు ఘోరాలు

## కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి జాతీయ రహదారిపై శనివారం రాత్రి కారు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు సిఐ కుమారస్వామి తెలిపారు. నక్కపల్లి ఎస్సీ కాలనీకి చెందిన లోడ సూర్యారావు (58) రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుండి తుని వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో సూర్యారావు తీవ్రంగా గాయపడ్డాడు. విశాఖలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సిఐ వెల్లడించారు. మృతుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: మండలంలో గురందరపాలెం గ్రామంలో అనధికారికంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ రాజారావు తెలిపారు. ఉత్తరేణి అప్పారావు అనే వ్యక్తి గత కొద్ది కాలంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడనే సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఏడు మద్యం సీసాలు పట్టుబడినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని తెలిపారు.



విధులపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## పోలీసు విధులపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగర సిపి శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు ఎసిపి రాంబాబు ఆధ్వర్యాన ఆరిలోవ పోలీసులు ఆదివారం శ్రీకృష్ణాపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పోలీసుల విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి రాంబాబు, సిఐ మల్లేశ్వరరావు విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన కల్పించారు. పోలీసులు ఆయుధాలు, పనిముట్లును ఏయే సమయాల్లో ఉపయోగిస్తారో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల సిబ్బంది, ఆరిలోవ పోలీసులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో జూనియర్ కళాశాలకు స్థలాన్ని కేటాయించాలని వెనుకబడిన తరగతుల అభ్యుదయ సేవా సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు ఆదివారం ఆరిలోవ, తోటగరువులో స్థానిక సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, తదితరులు మాట్లాడుతూ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆనుకొని ఉన్న పశుసంవర్ధక శాఖకు సంబంధించిన రెండు ఎకరాల స్థలాన్ని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధుకు అకాడమీ కోసం కేటాయించారని, ఆ స్థలాన్ని జూనియర్ కళాశాలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యేకు, జిల్లా కలెక్టర్‌కు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

## ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీకి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమునిపట్నం : ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ నిమిత్తం సొసైటీ ప్రతినిధులకు కలిగొట్ల స్విగ్గ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ఆదివారం రూ.10 వేలు చెక్కును అందజేశారు. ప్రతి విద్యార్థీ ఎన్ఎంఎంఎస్ పరీక్ష పాసై ప్రభుత్వం అందజేసే స్కాలర్ షిప్ సదుపాయాన్ని నాలుగేళ్ల పాటు పొందాలని శ్రీరామచంద్రమూర్తి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటాన మోహనరావు, కోశాధికారి బి.అప్పారావు, ఉపాధ్యక్షులు వై.రమణ, కార్యదర్శి రేఖ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులకు రూ.10 వేలు చెక్కు అందజేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

## ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ





స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : ఎన్ఎంఎంఎస్‌లో శిక్షణ పొందుతున్న సుమారు వంద మంది విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఉచిత శిక్షణా కేంద్రమైన చిట్టివలస జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వింగ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.ఆనంద్ స్టడీ మెటీరియల్ అందజేశారు. విశాఖ డాక్టర్ వివిఎస్.కృష్ణా కళాశాల సూపరింటెండెంట్ జివి అప్పారావు విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, రీసోర్స్ పర్సన్లు దొరబాబు, మాదాబత్తుల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సాంకేతిక సమస్యలపై నేడు గీతంలో సదస్సు

ప్రజాశక్తి -మధురవాడ : సమాచార సాంకేతిక రంగం అభివృద్ధితో పాటు సామాజిక వేదికల ద్వారా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 28వ తేదీన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ప్రత్యేక సదస్సును నిర్వహిస్తున్నట్లు గీతం మహిళా సాధికారిక విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ వి.బి.శ్రీవిద్య తెలిపారు. టెక్ మాంత్రిక్ ఐటి సంస్థతో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనితతో పాటు స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి, విశాఖ ఎంపీ ఎమ్.శ్రీభరత్‌తో పాటు విశాఖ నగర పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్, ఐటి రంగ నిపుణులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా కీర్తిశేషులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య మునిమనుమడు ఎమ్.జె.శ్రీకాంత్ వ్యవహరిస్తారని వెల్లడించారు. సదస్సులో ప్రధానంగా డీప్ ఫేక్, మొబైల్ హ్యాకింగ్, సోషల్ మీడియా దుర్వినియోగం, స్పై కెమెరా ద్వారా మహిళల వేధింపులు వంటి అంశాలపై పోలీసు అధికారులు, ఐటి రంగ నిపుణులు చర్చిస్తారని పేర్కొన్నారు.

## విద్యుత్, నిత్యావసర భారాలు తగ్గించాలి

ప్రజాశక్తి-మధురవాడ : పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల ధరలను తక్షణమే తగ్గించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన జివిఎంసి 7వ వార్డు పరిధి చంద్రంపాలెం, దుర్గానగర్‌లో ఆదివారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ, దీపావళి నుంచి ఉచితంగా గ్యాస్ అని సామాన్య ప్రజలను ఊరిస్తూ, రాష్ట్ర ప్రజలకు కనపడని వసూళ్ల దెబ్బ కొట్టడానికి ప్రభుత్వం సిద్ధపడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం మన్మధరావు, నాయకులు వి.సత్యనారాయణ, పి.వి.అప్పారావు, ఎన్.రాము, కె.చిన్న, పి.రమణ, ఎం.అప్పలనాయుడు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## కెజిహెచ్ కేన్సర్ విభాగం ఆధునికీకరణ

### సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జి ఆసుపత్రిలో కేన్సర్ రోగులకు ఉచిత వైద్య చికిత్సను అందజేస్తున్నామని ఇందులో భాగంగా ఆ విభాగాన్ని ఆధునికీకరించినట్లు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. ఆదివారం సాలిపేట కమ్యూనిటీ హాల్లో చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటుచేసిన రొమ్ము కేన్సర్ అవగాహన శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ శివానంద మాట్లాడారు. కెజిహెచ్‌లోని కేన్సర్ విభాగంలో రూ.28 కోట్లతో అధునాతన సాంకేతిక పరికరాలు, సిములెటర్ లీనియర్ యాక్సిలేటర్‌ను సమకూర్చుకున్నట్లు చెప్పారు. దీని సాయంతో కేన్సర్‌కు మెరుగైన చికిత్సను అందజేస్తున్నామన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చుకాగల వైద్యానికి ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందజేస్తున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చైతన్య స్రవంతి వాలంటీర్లు పాఠశాలల్లో అవగాహనా శిబిరాలు ఏర్పాటుచేసి రొమ్ము కేన్సర్‌పై చైతన్యం కల్పించాలని కోరారు. రొమ్ముల్లో గడ్డలు ఏర్పడిన సందర్భంలో నొప్పి ఉన్నా లేకపోయినా మెమోగ్రామ్ పరీక్ష చేయించుకుంటే వ్యాధి నిర్ధారణ కానుందని తెలిపారు. త్వరలో రొమ్ము కేన్సర్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని, మహిళలు వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రొమ్ము కేన్సర్ లక్షణాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కెజిహెచ్ కేన్సర్ విభాగం హెడ్ డాక్టర్ పాండురంగకుమారి, చైతన్య స్రవంతి ప్రతినిధులు విజయ, రుకీయాబాను, శారద, అనసూయ పాల్గొన్నారు.

## మిద్దె తోటలు పెంచాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మిద్దె తోటల మీద నగరవాసులకు అవగాహన ఉండాలని వనమాలి, సిటిజ గార్డెనింగ్ సంస్థలు నగరంలోని పలు ప్రదేశాలలో శని, ఆదివారాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇచ్చి పుచ్చుకునే విధానంలో కూరగాయల మొక్కలు, అంట్లు, విత్తనాలు పంపిణీ చేశారు. ఎకో వైజాగ్‌లో భాగంగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిద్దె తోటలపై నగరం అంతటా ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ ప్రతినిధులు అరవల అరుణ, మళ్ల సరిత, నాదెళ్ల జ్యోతి మాట్లాడుతూ, రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలు, కలుషితత ముందులతో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నామని తెలిపారు. ఎవరి ఇంటి వద్ద వారు కూరగాయలు, ఆకుకూరలు పండించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు తమను 7794930439, 8121382753, 8500874103 నెంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో 'ఎకో విజనరీ' పర్యావరణ సంస్థ ప్రతినిధులు జి.దనూష, డి.పూజిత, కె.మేఘన, కె.ఎల్.దీపిక, కె.కుసుమ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## బోరు ఏర్పాటు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామంలో ఎంపిపి నిధులతో బంగారమ్మతల్లి గుడి వద్ద కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఆధ్వర్యాన చేతి బోరు వేయించారు. 30 అడుగుల్లో నీరు పడడం వల్ల ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఎంపిపి శారదాప్రియాంకకు స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కార్మిక వర్గానికి అండ.. సిఐటియు జెండా

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం
- పద్మనాభంలో ఘనంగా సిఐటియు మండల కార్యాలయం ప్రారంభం




సిఐటియు కార్యాలయ ప్రారంభ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

**ప్రజాశక్తి - పద్మనాభం**

కార్మికవర్గానికి, బడుగు, బలహీన తరగతులకు గొప్ప అండ.. సిఐటియు జెండా అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. పద్మనాభం మండల కేంద్రంలో సిఐటియు మండల కార్యాలయాన్ని ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణం నడుమ ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి మారుమూల మండలాల్లో సిఐటియు కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం ఎంతో ఆనందదాయకమని, మండలంలో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు, కార్మికులకు ఇది ఎంతగానో అండగా నిలుస్తుందని అన్నారు. నేటి కాలంలో కొన్ని పార్టీల జెండాలు ఎన్నికల సమయంలో గ్రామాల్లో రెపరెపలాడి ఎన్నికలు ముగిసిన తరువాత ఎక్కడా కనిపించడం లేదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేసేది ఒక్క ఎర్రజెండా మాత్రమేనన్నారు. పాలకులు నిత్యావసర ధరలను అదుపు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఎన్నికల్లో విద్యుత్ బిల్లులు పెంచబోమని చెప్పిన చంద్రబాబు నేడు కరెంట్ బిల్లుల భారాన్ని జనంపై మోపుతున్నారన్నారు. రూ.6 వేల కోట్లను సర్దుబాటు ఛార్జీల పేరిట ప్రజలపై వేస్తున్నారని తెలిపారు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే నేటి పాలకులు మారాలన్నారు. ప్రత్యామ్నాయ విధానాలతో వచ్చేవారిని ప్రజలు ఆదరించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ఒక పార్టీ లడ్డూను చూపించి రాజకీయం చేస్తోందని, మరో పార్టీ ఆస్తులు విషయాల్లో తలమునకలై ఉందని అన్నారు. ఇలా పూర్తిగా వారివారి స్వప్రయోజనాల కోసమే పాకులాడుతున్నాయని విమర్శించారు. కార్మికులకు పనికి తగ్గ వేతనం దక్కడం లేదని తెలిపారు. భీమిలి నియోజకవర్గంలో అతి పెద్ద పరిశ్రమగా ఉన్న చిట్టివలస జ్యూట్ మిల్లును పూర్తిగా పాలకులు నాశనం చేశారన్నారు. దీనివల్ల ఎంతో మంది ఉపాధి కోల్పోయి అనేక రంగాలలో తక్కువ జీతానికి పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ప్రజా సంక్షేమంలో విఫలమయ్యాయన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో జనం అల్లాడుతున్నారని, వారిపై నేడు విద్యుత్ భారాలు మోపేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుందని అన్నారు. దీంతో సామాన్యుల బతుకులు మరింత భారంగా మారనున్నాయని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ చిట్టివలస జ్యూట్ మిల్లు మూసివేతతో పద్మనాభం, భీమిలి, ఆనందపురం మండలాల కార్మికులు పెద్ద సంఖ్యలో ఉపాధి కోల్పోయారని తెలిపారు. ప్రభుత్వాలు సామాన్యులకు ఉపాధి చూపే బాధ్యత నుంచి తప్పుకున్నాయని విమర్శించారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమన్నారు. సిఐటియు భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ ఉద్యమాలకు పద్మనాభం సిఐటియు కార్యాలయం ప్రధాన కేంద్రంగా నిలువనుందని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు నాగరాణి, సిఐటియు నాయకులు రవ్వ నర్సింగరావు, రాజ్‌కుమార్, ఎం.అప్పారావు, రాము, ఆదినారాయణ, ప్రజా సంఘాల నాయకులు సీతాదేవి, వెంకటలక్ష్మి, శ్రీదేవి, పద్మ, రమణమ్మ, అప్పలనర్సమ్మ, కెవిపిఎస్ నాయకులు భాగం లక్ష్మి పాల్గొన్నారు.

**భారీ ర్యాలీ, ఆకట్టుకున్న కళారూపాలు**

తొలుత పద్మనాభం పురవీధుల్లో ర్యాలీ సాగింది. కోలాటం. చిడతలు వంటి కళారూపాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అభ్యుదయ గీతాలు చైతన్యం నింపాయి. కార్యాలయ ఆవరణలో సిఐటియు జెండా ఆవిష్కరణ జరిగింది. ప్రాథమిక స్థాయి పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు, ధ్రువపత్రాలను అతిథులు అందజేశారు. సభలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, క్వారీ కార్మికులు, ఆటో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పద్మనాభంలో ర్యాలీలో పాల్గొన్న కార్మికులు, నాయకులు



రామచంద్రనగర్‌లో ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులు

## రామచంద్రనగర్ గ్రామ కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి -గాజువాక :** జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్‌లో ఆదివారం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బోర భాస్కరరావు, అధ్యక్షులుగా వి.నారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా డి.రమణ, కోశాధికారిగా జి.కమలాకరరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.రమేష్, జాయింట్ సెక్రటరీగా వి.కిరణ్, జాయింట్ కోశాధికారిగా ఎస్.వాసు, సభాపతిగా బిఎన్.రావు, జాయింట్ సభాపతిగా డి.దుర్యోధనరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.రమణ, భరత్, షీలా దాలయ్యతోపాటు 50 మంది కమిటీ సభ్యులతో నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, బలగ రామారావు, వి.చంద్రరావు, పిటి.నాయుడు పాల్గొని నూతన కార్యవర్గానికి పలు సూచనలు చేశారు.



ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

## ఆక్రమణలో ప్రభుత్వ భూమి

**ప్రజాశక్తి-పెందుర్తి :** భూమి ధర పెరగడంతో ప్రభుత్వ భూమి కనిపించిందంటే చాలు కబ్జాదారులు కన్నేసి, వాటిని అమాయకులకు అమ్మేసి రూ.కోట్లు సంపాదిస్తున్నారు దీనికి రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారు. సర్వే నెంబరు 26 చీమలాపల్లి దరి డంపింగ్ యార్డ్ పైన ప్రభుత్వ భూమి ఉంది. దీని మీద కొంతమంది కబ్జాదారులు కన్నేసి పంచుకున్నారు. అమాయకులను చూసి 60 గజాల స్థలం రూ.పది లక్షలు చొప్పున విక్రయాలు చేపట్టారు. నగరానికి దగ్గరగా ఉందని చెప్పి ఎటువంటి కాగితాలు లేకుండానే అమ్మకాలు చేస్తున్నారు. దీనంతటికీ సూత్రధారి ఒక మహిళ, కాలనీకి సంబంధించిన వ్యక్తి ఉన్నారు. తర్వాత రెవెన్యూ అధికారులు వస్తే కొనుక్కొన్న వారు లబోదిబోమంటున్నారు. ఈ కాలనీలో సుమారు 10 పట్టాలు మాత్రమే ఇచ్చారు. కానీ మాయమాటలు చెప్పడంతో కొందరు కొనేస్తున్నారు. ఈ స్థలానికి చుట్టూ కంచె, ప్రభుత్వ స్థలాలని బోర్డులు వేయాలని రెవెన్యూ అధికారులకు పలువురు ఫిర్యాదుచేశారు. దీంతో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు మాత్రమే పెట్టారు. కంచె ఏర్పాటుచేయలేదు. దీంతో కబ్జాదారులు కన్నేసి విక్రయాలు జరుపుకుంటున్నారు. రెండు రోజుల క్రితం ఇక్కడ రెండు స్థలాలు అమ్మకాలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమదారులకు అడ్డుకట్టు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

## హోంమంత్రిని కలిసిన వంశీకృష్ణ

**ప్రజాశక్తి-సీతమ్మధార :** రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను జనసేన పార్టీ విశాఖపట్నం అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. శాంతి భద్రతలు, మహిళలు భద్రతపై నిరంతరం శ్రమిస్తున్న మంత్రి అనితకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.



హోంమంత్రి అనితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

# మహిళల్లో కేన్సర్ నివారణకు కృషి చేయాలి

**ఒజిఎస్‌వి 58వ వార్షిక ప్రాంతీయ సదస్సులో పోలీసు కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చీ**



సదస్సును ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, పక్కన డాక్టర్ వైఎల్ నరసింగరావు, కిరణ్మయి తదితరులు

**ప్రజాశక్తి-మధురవాడ :** మహిళల్లో కేన్సర్ నివారణకు కృషిచేయాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చీ కోరారు. వైజాగ్ కన్వెన్షన్‌లో ఒబెస్ట్రిట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ (ఒజిఎస్‌వి) ఆదివారం నిర్వహించిన ప్రసూతి, స్త్రీ వైద్యుల 58వ వార్షిక ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అండాశయ, గర్భాశయ కేన్సర్, పిసిఒడి నివారణకు ప్రసూతి, స్త్రీ వైద్యులు ప్రత్యేక చొరవచూపాలని కోరారు. హెచ్‌పివి వ్యాక్సిన్‌తో గర్భాశయ ముఖద్వార కేన్సర్ నివారించవచ్చన్న అవగాహన మహిళల్లో కల్పించాలన్నారు. టెలిమెడిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవల విస్తరణకు కృషి చేయాలని సూచించారు. స్త్రీలపై హింస, విధి నిర్వహణలోని మహిళా వైద్యులపై దాడులు క్షమించరానివని, దాడులు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఫెడరేషన్ ఆఫ్ ఒబెస్ట్రిట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఒజిఎస్ఐ) అధ్యక్షులు డాక్టర్ జయదీప్ టాంక్ మాట్లాడుతూ, వైద్య చట్టాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. ఒజిఎస్‌వి అధ్యక్షులు డాక్టర్ వైఎల్.నరసింగరావు, కార్యదర్శి డాక్టర్ కిరణ్మయి గొట్టపు మాట్లాడుతూ, సదస్సు ప్రాధాన్యత, గైనకాలజికల్ సొసైటీ బాధ్యతను వివరించారు. డాక్టర్ జివి రామరాజు మాట్లాడుతూ, ఐవిఎఫ్‌లో నూతన వైద్యవిధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఐ.వాణి, సంధ్యాదేవి, సౌమిని, గీతావందన, పద్మావతినాయుడు, శిరీషారాణి, విద్యారమ, రాగసుధ, మాధురి, పల్లవి స్త్రీల వ్యాధులపై మాట్లాడారు. సీనియర్ డాక్టర్లు శశిప్రభ, కృష్ణమ్మ, సుబ్బరాజు, టి.రాధ, టి.పద్మావతి, సీతారామరాజు, సమన్వయపరిచారు.

## కుంచుమాంబ ఆలయంలో త్రిశూలం ఏర్పాటు

**ప్రజాశక్తి- గాజువాక :** జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడి కుంచుమాంబ అమ్మవారి గుడి ఆవరణలో 100 కేజీల ఇత్తిడితో 20 అడుగుల త్రిశూలాన్ని తయారుచేసి ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక తొలి శాసనసభ్యులు చింతలపూడి వెంకట రామయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుంచమాంబ సేవ సభ్యులు, వడ్లపూడి గ్రామ కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు ముద్దపు దామోదర్, బొండా గోవిందరాజులు, దుగ్గపు దానప్పలు, గాలి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏడేళ్లుగా పెంచని జీతాలు

**ప్రజాశక్తి -ములగాడ :** కోరమండల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు వర్కర్లకు ఏడేళ్లుగా యాజమాన్యం జీతాలు పెంచలేదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు కాంట్రాక్టు వర్కర్లతో కలిసి కంపెనీ గేటు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, వాటిని పరిశీలించి జీతాలు పెంచాలని కోరారు. కంపెనీలో ఉన్న కేంటిన్‌లో మెరుగైన భోజన సదుపాయం కల్పించాలని, కాంట్రాక్ట్ లేబర్ సీనియార్టీని బట్టి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, గుడాల రాంబాబు, సూరిబాబు, సత్యనారాయణరెడ్డి, కోయిలాడ శంకరరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కోలాటం చిన్నారులకు చీరలు

**ప్రజాశక్తి -ములగాడ :** జివిఎంసి 61, 62 వార్డుల పరిధిలో కోలాటం ఆడే చిన్నారులకు మజ్జి సోమేష్ ఆర్థిక సహాయంతో ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్న వయసులోనే కోలాటం ఆడటం తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, టిడిపి నాయకులు ఉరుకూటి పైడి రాజు, తదితరులు పాల్గొన్నారు.



చీరలు అందుకున్న చిన్నారులతో మజ్జి సోమేష్

# పాలసేకరణ ధర తగ్గింపుపై ఆందోళన

## పలుచోట్ల పాల సేకరణ కేంద్రాల వద్ద రైతుల నిరసనలు



మాడుగులలో ఆందోళన చేస్తున్న వెంకన్న, పాడిరైతులు

**ప్రజాశక్తి -అచ్యుతాపురం** : విశాఖ డెయిరీ తగ్గించిన ఆవుపాల సేకరణ ధరను వెంటనే పెంచాలని మండలంలో కొండకర్ల, హరిపాలెం, ఎర్రవరం గ్రామాలలో పాల కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం పాడిరైతులు ఆందోళన చేశారు. అచ్యుతాపురంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు కాండ్రేగుల రామసదాశివరావు, సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము మాట్లాడుతూ, విశాఖ డెయిరీ ఆవుపాల సేకరణ ధరను లీటరుకు రూ.నాలుగు తగ్గించడం అన్యాయమన్నారు. పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఇప్పటికే గిట్టుబాటు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఉన్న ధరను తగ్గించడం దుర్మార్గమన్నారు. విశాఖ డెయిరీలో అవినీతి,అక్రమాలు పెరిగిపోయాయని, ఈ నేపథ్యంలో 64 యాక్ట్‌ను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. పాడిరైతుల సమస్యలు, పాలసేకరణ ధరపై ఈనెల 29న విశాఖలోని విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద మహాధర్నా, ఆందోళనను పాడిరైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొండకర్ల సంఘం అధ్యక్షులు ధూళి సన్యాసిరావు, పెంటకోట ఆది బాబు, శరగడం గణేష్ పాల్గొన్నారు రామకష్ణ, సత్యనారాయణ, నాయుడు, సత్తిబాబు పాల్గొన్నారు.

**చోడవరం** : విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను వెంటనే పెంచాలని ఈనెల 29న విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంవద్ద మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇరట నరసింహమూర్తి పిలుపునిచ్చారు. శనివారం రాత్రి వి మాడుగుల మండలం వీరారానారాయణం.గ్రామంలో పాడిరైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేసారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, వ్యవసాయం లాభసాటిగా లేని పరిస్థితుల్లో పాడిపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు, విశాఖ డెయిరీ చర్యలు ఇబ్బందికరంగా మారాయన్నారు. ప్రస్తుతం డెయిరీ చెల్లిస్తున్న పాలసేకరణ ధర ఎటూ సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో గేదె పాలు లీటరుకు రూ.100, ఆవు పాలకు రూ.50 చెల్లించాలని, పాడిరైతులకు విశాఖ డెయిరీ రెండేళ్లుగానిలిపేసిన బోనస్‌ను పునరుద్ధరించాలని, పశుదాణా రేట్లను తగ్గించాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈనెల 29న డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద మహాధర్నా విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బిటి దొర పాల్గొన్నారు.

**బుచ్చయ్యపేట** : విశాఖ డెయిరీ తగ్గించిన ఆవుపాల సేకరణ ధరను పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం బుచ్చయ్యపేట పాలకేంద్రం వద్ద పాడిరైతులు నిరసన చేపట్టారు. పాల ధర తగ్గించడం, పశుదాణా, గడ్డి ఖర్చులు పెరిగిపోవడంతో పాడిపోషణభారమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గాజువాక డెయిరీ కార్యాలయం వద్ద మహాధర్నా విజయవంతం చేయాలన్నారు. దాడి నాయుడు, పూడి రామారావు రైతులు పాల్గొన్నారు

**వడ్డాది** : విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల ధరను వెంటనే పెంచాలని ఈనెల 29న గాజువాకలోని విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంవద్ద ఆందోళనను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా వ్యవసాయ సహాయ కార్యదర్శి ఎస్‌వి నాయుడు, బుచ్చయ్యపేట మండల కార్యదర్శి పినపాత్రుని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బంగారుమెట్ట పాలకేంద్రం వద్ద పాడిరైతులు ఆందోళన చేపట్టారు.



ఏటికొప్పాకలో ఆందోళన చేస్తున్న పాడిరైతులు

**యలమంచిలి:** విశాఖ డెయిరీకి వస్తున్న లాభాలను సొంత ఆస్తులు పెంచుకోవడానికి వాడుకుంటున్న డెయిరీ యాజమాన్యం, పాల సేకరణ ధరను తగ్గించి రైతులకు అన్యాయం చేస్తోందని ఎపి రైతు సంఘం నేత సత్యనారాయణ, సిఐటియు నేత సిహెచ్ శివాజీ ఆధ్వర్యంలో పాడిరైతులు ఏటికొప్పాక పాలకేంద్రం వద్ద నిరసన చేపట్టారు. ఈనెల 29న డెయిరీ ప్రధాన కేంద్రం వద్ద చేపట్టే మహాధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డెయిరీ యాజమాన్యం ఏటా కోట్లలో అవినీతి, అక్రమాలకు పాల్పడి డెయిరీకి నష్టాలు చూపి, వాటిని రైతులపై రుద్దాలని చూస్తున్నారని మండిపడ్డారు. చూపిస్తున్నారని వాపోయారు. సహకార చట్టం 1964లో ఉన్న విశాఖ డెయిరీ, తర్వాత డెయిరీ యాక్ట్ 1995లోకి, అనంతరం కంపెనీ చట్టంలోకి మారి రైతుల నోరు నొక్కిందని ఆరోపించారు. కార్యక్రమంలో రైలు సంఘం నాయకులు ఈశ్వరరావు, రైతులు నానిబాబు, అప్పారావు పాల్గొన్నారు

## 29న మహా ధర్నాను విజయవంతం చేయాలి




మాట్లాడుతున్న కర్రి అప్పారావు

**అనకాపల్లి** : విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పునరుద్ధరించాలని గాజువాక వద్ద ఈనెల 29న ఉదయం 10 గంటలకు నిర్వహించే మహా ధర్నాకు రైతాంగం, పాడిరైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, విలేకరులతో మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలో 20 మండలాల్లో పాలకేంద్రా వద్ద కరపత్రాలతో ప్రచారం చేసి ధర్నాలు నిర్వహించామన్నారు. పాడిరైతుల సమస్యలపై నిర్వహించే మహాధర్నాకు గ్రామ రైతు సంఘాల అధ్యక్షులు, పాల రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గొర్రెలు మేకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, రైతు సంఘ నాయకులు రావి దేవుడు, బుద్ధ రంగారావు, గాడి నాయుడు,కాళ్ల తేలయ్య బాబు, కె.రామ సదాశివరావు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఆరుగురు



విజేతలకు బహుమతులు ఇస్తున్న త్రిమూర్తులు రెడ్డి

**ప్రజాశక్తి -అచ్యుతాపురం** : జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి చెకుముఖి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన 160మంది విద్యార్థులు హాజరుకాగా, ప్రతిభ కనబరిచి విజేతలైన ఆరుగురు విద్యార్థులను వచ్చేనెల 9,10 తేదీల్లో విశాఖలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు చీడికాడ మండలం అప్పలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జె గుణశ్రీ నవ్యశ్రీ, బి.దివ్య, శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలు విద్యార్థులు సాయి శ్రవణ్, ఎంఎస్‌వి సాత్విక్, ఎస్ కిరణ్ కుమార్ ఎంపికయ్యారు. విజేతలకు జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి సర్టిఫికెట్లు మెమెంటోలు ఇచ్చి సత్కరించారు. పోటీలను జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి పి రంగరాజు ఎం శేషగిరిరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో జెవివి అనకాపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగచంద్ర, మారిశెట్టి వెంకట అప్పారావు, రమేష్ వర్మ, శ్రీరామమూర్తి, దొర, మల్లేష్ లింగం, జిల్లా కార్యదర్శి బొడ్డేడ రామ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన భవ్య శ్రీ



వడిసెల భవ్య శ్రీ

**ప్రజాశక్తి -అచ్యుతాపురం** : మండలంలోని చౌడపల్లి గ్రామానికి చెందిన వడిసెల భవ్యశ్రీ నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణురాలై ఎంబిబిఎస్ సీటు సాధించింది. భవ్యశ్రీ 623 మార్కులు సంపాదించి, నీట్‌లో 51463 ర్యాంక్ సాధించి, బిసి'ఎ' కోటాలో ఎంబిబిఎస్ సీటు కేటాయించినట్లు ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ లెటర్ వచ్చింది. ఈనెల 28న సోమవారం రెండు గంటలకు జిఎంసిజి మెడికల్ కాలేజీ గుంటూరులో హాజరుకావాలని పేర్కొన్నారు. భవ్యశ్రీకి మెడికల్ సీట్ రావడంపై చౌడపల్లి గ్రామస్తులు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తరుణ్



తరుణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రఘు

**ప్రజాశక్తి- దేవరాపల్లి** : మండలంలోని తెనుగుపూడి అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి ఆర్.తరుణ్ జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీల్లో స్వర్ణ పతకం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-14 విభాగంలో ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జి. తరుణేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని, తర్ఫీదునిచ్చిన పిఇటిని ప్రిన్సిపల్ పి.రఘు అభినందించారు.

## నిత్యాన్నదానం

**ప్రజాశక్తి-అనకాపల్లి** : కన్యకా పరమేశ్వరి అయ్యప్ప దేవాలయంలో ఈనెల 28, సోమవారం నుండి డిసెంబర్ ఒకటో తేదీ వరకు అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ భక్తులకు, వెంకటేశ్వర స్వామి వంటి మాలాధారణ భక్తులకు ప్రతిరోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు, చింతాడ హేమారావు, భక్తుల సహాయ సహకారాలతో దీన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనకాపల్లి చుట్టుపక్కల గ్రామాల్లో మాలాధారణ భక్తులు వినియోగించుకోవాలని కోరారు. కన్యకా పరమేశ్వరి అయ్యప్ప దేవాలయ కమిటీ అధ్యక్షులు కటకం లక్ష్మణరావు, కార్యదర్శి ఉప్పల శ్రీనివాసరావు, కోశాధికారి వి వి ఎన్.కె పేర్రాజు, కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



గవరపాలెం హై స్కూల్ పూర్వ విద్యార్థులు

**ప్రజాశక్తి -అనకాపల్లి** : అనకాపల్లి గవరపాలెం ఎమ్‌జిహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు బల్లా నాగభూషణం, కార్యదర్శి దాడి శివరామకృష్ణ సంఘ నూతన సభ్యుల పరిచయం, సంఘ అభివృద్ధి, నిర్వహించ బోయే తదుపరి కార్యక్రమాలను వివరించారు.డిశంబరు 29న కుటుంబ సభ్యులతో ఎమ్‌జిహెచ్.స్కూల్ ఆవరణలో వన సమారాధన నిర్వహించటానికి సభ్యులందరూ ఏకగ్రీవంగా నిర్ణయించారు.గౌరవాధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, కమిటీ ఛైర్మన్ పిళ్ళా శివ అప్పారావు, సంఘ గౌరవ సలహా సభ్యులుపి.సత్యనారాయణ, పట్నాల క్రిష్ణ మోహన్, కొత్తుర్తి రామారావు, పొన్నా చల్మాజీ, మారోజు సత్యనారాయణ, దాడి జగన్నాధరావు పాల్గొన్నారు..

## వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి** : జిల్లాలో పనిచేస్తున్న 104 ఉద్యోగులకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో 104 ఉద్యోగుల జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదని, ఆప్కాస్ నిర్ణయించిన వేతనం రూ.18,500 కంటే అతి తక్కువ జీతాలతో పనిచేస్తున్నామన్నారు. రాబోయే కాలంలో డిమాండ్ల సాధనకు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కోశాధికారి, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న 104 ఉద్యోగులు

**జిల్లా కమిటీ నూతన కార్యవర్గం**

యూనియన్ గౌరవాధ్యక్షులుగా వివి శ్రీనివాసరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.నాగసాయి, ఆర్ అప్పలరమణ, కోశాధికారిగా జి చంద్రుడు, ఉపాధ్యక్షులుగా ఎస్ సూర్యకళ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏ మనీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ భార్గవ్, డివిజన్ లీడర్లగా కిషోర్, శివలక్ష్మి (నర్సీపట్నం) రాజబాబు, మధు చిరంజీవి, మనీషాలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ముగిసిన ఐఐపిఇ ఫిట్ ఇండియా ఫ్రీడం రన్




వాక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

**ప్రజాశక్తి.-సబ్బవరం** : ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపిఇ) ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0, స్వచ్ఛత కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగాఐఐపిఇ యుఎంసిఎ నుంచి కాళీమాత విగ్రంవరకు వాక్‌థాన్ నిర్వహించారు.

ముఖ్య అతిథిగా ఐఐపిఇ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షులు ప్రొఫెసర్ పరితోష్ కంసాబానిక్, అతిథులుగా ఐఐపిఇ డైరెక్టర్, ప్రొఫెసర్ శాలివాహన్, జివిఎంసి అదనపు కమిషనర్, ఆర్. సోమన్నారాయణ పాల్గొన్నారు. ముందుగా నోడల్ ఆఫీసర్ డాక్టర్. రంధి రామునాయుడు ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ ప్రాముఖ్యతను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ బానిక్ మాట్లాడుతూ విద్యార్థులకు రోజువారీ జీవితంలో ఫిట్నెస్ అవసరాన్ని నొక్కి వివరించారు. ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ స్వచ్ఛతలో దేశంలోనే విశాఖపట్నాన్ని నాలుగో స్థానంలో నిలిపిన జివిఎంసి అధికారులు, ఉద్యోగులు, కార్మికుల కష్టం, నిబద్ధతను కొనియాడారు.జివిఎంసి అదనపు కమిషనర్ ఆర్.సోమనారాయణ విద్యార్థులకు ఫిట్‌నెస్‌పై సూచనలు చేశారు. .జివిఎంసి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరేష్‌కుమార్ ఆరోగ్యమైన జీవన శైలిలో స్వచ్ఛత ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు..ఐఐపిఇ రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది ఫిట్‌నెస్, యోగా, మెడిటేషన్ ప్రాముఖ్యతను వివరించారు. నోడల్ ఆఫీసర్ రంధి రామునాయుడు స్వచ్ఛతలో శానిటరీ కార్మికుల కృషిని కొనియాడారు.. ఐఐపిఎ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ 51 మంది జివిఎంసి కార్మికులు, సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లను సత్కరించి, వారికి ఉపయోగపడే సామగ్రిని అందజేశారు. స్వచ్ఛభారత్ ప్రచారంలో భాగంగా ఐఐపిఇ విద్యార్థులు బీచ్ క్లీన్‌డ్రైవ్ నిర్వహించారు. కెజిహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ. గోపాల్ రావు, మెడికవర్ హాస్పిటల్స్ గైనకాలజిస్టు డాక్టర్ కె. సువర్ణ రేఖ పాల్గొన్నారు.

## పిఆర్ డిప్లమో ఇంజినీర్ల కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి -అనకాపల్లి :** అనకాపల్లి జిల్లా ఆంధ్రప్రదేశ్ పంచాయత్‌రాజ్ డిప్లమో ఇంజినీర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఆదివారం సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా నర్సీపట్నం డిఇఇ రుత్తల రామవెంకటసత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్‌గా కోటపాడు మండల ఇంజినీరు పి.సుమతి, ప్రధాన కార్యదర్శిగా చోడవరం ఎంఇఒ పి.శాంతారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోటపాడు పిఐయు ఎఇఇ వివి.రమణమ్మ, కోశాధికారిగా కెవివిజెజె.రాజు రాజు ఎన్నికయ్యారు. వీరిని అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి -అనకాపల్లి** : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. ఆదివారం నర్సింగరావు పేట, కోలపర్తి అప్పారావు ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి శాసనమండలి వేదికగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుండే ప్రణాళికా యుతంగా ముందుకు వెళ్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్, జిల్లా నేతలు కె.శ్రీనివాసు, కరుణాకర్, టి.రామకష్ణ, ధర్మారావు, దుర్గాప్రసాద్, ధనుర్జయి, జగన్మోహన్, డి నూకరాజు, కొణతాల గణేష్, నూకేష్, ఉమ్మడి జిల్లాల మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసిన దేవర

**ప్రజాశక్తి- బుచ్చయ్యపేట:** విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను శివాజీపాలెంలోని వారి కార్యాలయంలో బుచ్చయ్యపేట మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు, పి భీమవరం ఎంపిటిసి దేవర అప్పారావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు చెప్పినట్లు తెలిపారు.

# నిర్వాసిత సమస్యలపై సిపిఎం పోరాటం

**● పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం**

**ప్రజాశక్తి-రాంబిల్లి :** మండలంలోని ఎన్ఎఒబి, సెజ్ నిర్వాసితుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి సిపిఎం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. ఆదివారం రాంబిల్లి మండల కేంద్రంలో తుఫాన్ బిల్డింగ్ వద్ద జి.దేవుడునాయుడు అధ్యక్షతన సిపిఎం మండల ప్రథమ మహాసభ జరిగింది.ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి పార్టీ కార్యకర్తలందరూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, మండలంలో నాబ్, సెజ్ నిర్వాసిత సమస్యలతోపాటు ఫార్మా కాలుష్యం, రైతాంగం సమస్యలపై సిపిఎం పోరాటం నిర్వహిస్తోందన్నారు. అయితే నావెల్ బేస్ నిర్వాసితుల సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయ న్నారు. వరుస ఫార్మా ప్రమాదాలు, ఫార్మా కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు, స్థానికులకు ఉపాధి గగనమౌతో ందన్నారు. కొత్తూరు వద్ద ఏడుముల ఆనకట్ట కొట్టేయడంతో వేలాది మంది రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మండలంలోని అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం రాంబిల్లి మండల మహాసభలో తీర్మానం చేసి, రాబోయే కాలంలో వాటి పరిష్కారానికి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. నేవీ మెయిన్ గేట్ నుండి వెంకటాపురం సెంటర్ వరకు గుంతలమయం, దుమ్ము,ధూళితో ఉన్న ప్రధాన రహదారితో వేలాదిమంది ప్రయాణికులు, వ్యాపారస్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పాలకులకు పట్టడం లేదని మండిపడ్డారు. నివాస ప్రాంతాల్లో తాగునీరు లేక, పారిశుధ్యం క్షీణించి, దోమలు, విషజ్వరాల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. రాబోయే కాలంలో సమస్యలపై ఉద్యమిస్తామన్నారు. మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ రాము, సిపిఎం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.




రాంబిల్లి మండల మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

### రాంబిల్లి మండల కార్యదర్శిగా దేముడునాయుడు



రాంబిల్లి మండల మహాసభలో నూతన కమిటీని ఏడుగురితో ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా జి దేముడు నాయుడు, సభ్యులుగా ఎన్.నారాయణ రావు, సిహెచ్. రామకృష్ణ, ధోని కాశీ, వై.రాము, లక్ష్మి, నూకరత్నంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### మాడుగుల మండల కార్యదర్శిగా నరసింహమూర్తి



**వి.మాడుగుల :** సిపిఎం వి.మాడుగుల మండల కార్యదర్శిగా ఇరట నరసింహ మూర్తి ఎన్నిక య్యారు. పార్టీ మండల మహాసభ శంకరం గ్రామంలో జరిగింది. దీనిలో భాగంగా ఏడుగురుతో పార్టీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

# గ్రామకంఠం స్థలాన్ని రక్షించాలి

**● ఆక్రమించి, అమ్మజూపుతున్నారు : సిపిఎం వెంకన్న**



అన్యాక్రాంతమౌతున్న గ్రామకంఠం స్థలం

**ప్రజాశక్తి- దేవరాపల్లి :** దేవరాపల్లి గ్రామపంచాయతీలో గ్రామకంఠం స్థలాలను విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారనిసిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న విమర్శించారు గతంలో కొబ్బరి తోట, డంపింగ్ యార్డును అన్యాక్రాంతం చేసి అమ్మేందుకు సిద్ధంకాగా సిపిఎం అడ్డుకుందన్నారు. దీంతో డంపింగ్ యార్డు స్థలంలో సచివాలయం, కొబ్బరి తోట స్థలంలో హెల్త్ సబ్‌సెంటర్, రైతు భరోసా కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను నిర్మించారన్నారు. ఇపుడు పాత డంపింగ్ యార్డు స్థలంలో లక్షలు విలువ చేసే గ్రామకంఠం స్థలాన్ని ఆక్రమణ చేసి అమ్మజూపుతున్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందునుంచే దీనికి స్కెచ్ వేయగా, అప్పట్లో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా నిలుపుదల చేశారన్నారు. ఈభూమిలో హెచ్చరిక బోర్డులు పెడతామని రెవెన్యూ అధికారులు చెప్పి ఏడాది గడుస్తున్నా, ఇప్పటివరకు పెట్టలేదన్నారు. ఈప్రాంతంలో పేదలకు ఇళ్లస్థలాలను ఇస్తామని ఇప్పటికే లక్షలాది రూపాయలు వసూలు చేశారని, పేదలకు ఇల్లు స్థలాలు ఇచ్చినట్లు చూపించారన్నారు.మండల కేంద్రంలో భూముల ధరలు పెరగడంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోరకు రూ.కోటి విలువ చేసే ఈ భూమిని సర్వే నెంబరు మార్చి అమ్మేసారన్నారు. దీనిపై దేవరాపల్లి పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసామన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని, వెంటనే అధికారులు జోక్యం చేసుకుని గ్రామకంఠంలో హెచ్చరిక బోర్డులు పెట్టాలని, అమ్మజూపుతున్న వారిని గుర్తించి గ్రామకంఠం స్థలానికి రక్షణ కల్పించాలని కోరారు.

# ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు వద్దు

**ప్రజాశక్తి-అనకాపల్లి** : ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతల నుంచి తప్పించి కేవలం బోధనకు మాత్రమే వినియోగించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి కోరారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యుటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంలో కూడా బోధనేతర బాధ్యతలతో బోధనా సమయం కుంటుపడుతోందని, దీనిపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. నేడు పాఠశాలల్లో 40 వరకు యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ పనులు చేయడం వలన సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, వృత్యంతర శిక్షణ తరగతులు, కంప్యూటర్లో చేసే ఆన్‌లైన్ పనులు ఉపాధ్యాయులకు తీవ్రమైన తలనొప్పిగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఇఒలను బోధనేతర పనులకు వాడుకోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శి శేషు కుమార్, కళింగ సతీష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్యబాబు, మున్సిపల్ ఉపాధ్యాయ నాయకులు మాకిరెడ్డి రాజు నాయుడు, నాతవరపు సతీష్, జగన్, సీనియర్ నాయకులు శాస్త్రి, లోవరాజు ,దేవుడు నాయుడు, శ్రీనివాస్, శివ ప్రసాద్, అప్పలరాజు, రామచంద్రరావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

## మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** మెప్మా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో అర్బన్ మార్కెటును ఆదివారం టిడిపి బీసీ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్టాళ్లను సందర్శించారు. పట్టణంలోని 81వ వార్డు గవరపాలెం పార్కు సెంటర్ వద్ద జివిఎంసి యుసిడి, మెప్మా స్వయం సహాయక సంఘ సభ్యులతో మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. . ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగంచేసుకుని సొంతంగా చిరు వ్యాపారాలు చేసి జీవించడం శుభపరిణామమని అన్నారు.కొత్త సభ్యులను డ్వాక్రా సంఘాల్లో చేర్చుకొని వారికి ఆర్థికంగా లబ్ధి చేకూరేలా అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిడి వై.సంతోష్‌కుమార్, సిహెచ్ సందీప్, కూటమి పార్టీ నాయకులు బొడ్డేడ జోగి నాయుడు, కొణతాల అప్పలరాజు, విల్లూరి హరి, మారిశెట్టి భాస్కర్, సి ఓ కొండమ్మ, రాజేశ్వరి, మల్ల రామకృష్ణ, దాడి వెంకట అప్పారావు, పెంటకోట శ్రీనివాస్, మల్ల గణేష్, పొలమరశెట్టి చందు,చదరం శివ అప్పారావు, వేగి కష్ణ, పీలా శ్రీనివాసరావు, ఎండకుర్తి అప్పలరాజు, నంద్యాల గణేష్, షేక్ రియాజ్ పాల్గొన్నారు.

## శ్రీరాంపురంలో పోలీస్ చెక్‌పోస్ట్

**ప్రజాశక్తి- దేవరాపల్లి :** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రైవాడ పంచాయతీ శివారు శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద పోలీస్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ చెక్‌పోస్ట్ వద్ద 8 మంది సిబ్బంది నిరంతరం తనిఖీలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. స్థానిక ప్రజలు సహకరించాలని ఎస్ఐ కోరారు.

## 11న సాంబమూర్తి శూలాల మహోత్సవం

**ప్రజాశక్తి- మునగపాక:** వచ్చేనెల 11న నిర్వహించనున్న సాంబమూర్తి శూలాల మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సాంబమూర్తి స్వామి కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, కూటమి నాయకులు టెక్కలి పరశురాం, మొల్లేటి సత్యనారాయణ, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు ఆడారి మహేష్ ,గ్రామ పెద్దలు కోనపల్లి రామ్మోహన్రావు, అలంక సూర్యప్రకాశరావు, పిల్లి అప్పారావు, గోగులపాటి నెహ్రూ, శరగడం జగన్ పాల్గొన్నారు.

# ఎండి పోతున్న వరి పంట

## -మరమ్మతుకు నోచని కల్యాణపులోవ ఎడమ కాలువ గేట్ - ఆందోళనలో రైతులు

**ప్రజాశక్తి -కొత్తకోట:**పొట్టలో దశ లో ఉన్న వరి పంటకు పుట్టె డు సాగు నీరు అవసరం అనే సామెతకు కల్యాణపులోవ జలాశయం గండి కొట్టింది. సుమారు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే ఈ జలాశయం ఎడమ కాలువ సూయిస్ గేట్ మరమ్మతుకు గురి కావడంతో ఈ దుస్థితి దాపరించింది. గత 15 రోజులుగా పొట్ట దశలో ఉన్న వరి పంటలకు సాగునీరు అందక పోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

రావికమతం మండలం చీమలపాడు శివారు కళ్యాణపులోవ జలాశయం కింద సుమారు 4 వేల 848 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఈ భూములకు ప్రతి ఏటా ఆగస్ట్‌లో సాగు విడుదల చేస్తారు. ఈ ఏడాది కూడా సాగు నీరు విడుదల చేసిన నెల రోజుల తర్వాత సాగు నీరు అందించే సూయిస్ గేట్ మరమ్మతుకు గురైంది. దీంతో, పొట్ట దశలో ఉన్న వరి పంటకు సాగునీరు ప్రశ్నర్ధకంగా మారింది. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులు ఈ దశలో సాగునీరు అందకుంటే వరి పంట ఎండిపోయే ప్రమాదం ఉందని



నీరు లేక ఎండి పోతున్న వరి



ఎండి పోయిన కాలువ

రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న తడి మరో వారం రోజులు పాటు ఉంటుందని, ఈ లోగా సాగు అందక పోతే ఆరు గలాలు కష్టపడి పండించిన పంట చేతికి అందని పరిస్థితి ఉంటుందని పలువురు ఆయు కట్టు రైతులు లాలం అప్పలనాయుడు, గాలి నాయుడు, కోట రాజారావు, అప్పారావు, గొల్లి నాయుడు, తాతలు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు పర్యాయాలు ఏర్పడిన తుఫాన్ ఈ ప్రాంతంలో ఎటువంటి ప్రభావం చూపక పోవడంతో జలాశయం నుంచి వచ్చే సాగునీరుపైనే ఆధార పడాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు పేర్కొన్నారు....

ఈ విషయంపై కల్యాణపులోవ జలాశయం కొత్తకోట సెక్షన్ ఏఈ సూర్యను వివరణ కోరగా సూయిస్ గేట్ మరమ్మతుపై జిల్లా టెక్నికల్ డిఈకి నివేదిక అందజేశామన్నారు. ఆయన ఆధ్వర్యంలో టెక్నికల్ బృందం పర్యవేక్షణ చేసి మరమ్మత్తు ప్రయత్నాలు చేసినప్పటికీ వీలు కాకపోవడంతో విజయవాడ, తాటిపూడి, విశాఖపట్నం సంయుక్త టెక్నికల్ బృందాన్ని రప్పించి మరమ్మతులు చేపట్టామన్నారు. అయితే ఏళ్ల నాటి గేటు కావడంతో 36 అడుగుల లోతు నీటిలో గడ్డర్‌ను వెల్డర్ సహాయంతో కటింగ్ చేసి రోప్ సాయంతో పైకి లేపే ప్రయత్నం చేస్తున్నామని ఏఈ సూర్య వివరించారు. మరో రెండు రోజులలో తమ ప్రయత్నం ఫలించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



స్పీకర్‌ను సత్కరిస్తున్న క్షత్రియ పరిషత్ నాయకులు

## స్పీకర్ అయ్యన్నకు ఘన సత్కారం

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :**స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడును క్యాంపు కార్యాలయంలో ఆదివారం నర్సీపట్నం, తుని, పాయకరావుపేట, అనకాపల్లి, లింగరాజుపాలెం క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో క్షత్రియులు మర్యాదపూర్వకంగా కలిశారు.స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరును భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి, నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నామకరణం చేసినందుకుగాను కూటమి ప్రభుత్వానికి, స్పీకర్ అయ్యన్నపాత్రుడకు కృతజ్ఞతలు తెలిపారు.నర్సీపట్నం క్షత్రియ పరిషత్ ప్రెసిడెంట్ గణపతి బంగార్రాజు అయ్యన్నను రాజుల తలపాగాతో అలంకరించారు. నర్సీపట్నం నియోజకవర్గంలో అనేక ప్రభుత్వ విద్యా సంస్థలు స్థాపించి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దినందుకు గాను క్షత్రియ పరిషత్ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం క్షత్రియ పరిషత్ కార్యదర్శి చక్రపాణి రాజు, కోశాధికారి నాగేంద్ర రాజు, మాజీ ఎమ్మెల్యే తుని అశోక్ బాబు రాజు, పాయకరావుపేట శ్రీహరి రాజు, అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి లింగరాజుపాలెం క్షత్రియ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.



గీతా పారాయణం చేస్తున్న మహిళలు

## ఉపమాకలో గీతా పారాయణం

**ప్రజాశక్తి -నక్కపల్లి:**ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న దేవస్థానంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా శ్రీకృష్ణ పరివార్ వ్యవస్థాపకులు పెద్దిబోట్ల మాధురి రామకృష్ణ, (కాకినాడ) ఆధ్వర్యంలో 100 మంది సేవకులతో గీతాపారాయణం చేపట్టారు. శ్రీకృష్ణ పరివార్ నేతృత్వంలో ఇప్పటికే పలు ఆలయాల్లో గీతా పారాయణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి, డాక్టర్ గొట్టుముక్కల గాయత్రి దేవి, గురు భవానీ దవరసింగి రాంబాబు, వెంకన్న ఆలయ మాజీ ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, శ్రీకృష్ణ పరివార్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు

## టిడిపి పాలనలో అభివృద్ధికి అడుగులు

**ప్రజాశక్తి-అచ్యుతాపురం** : టిడిపి పాలనలోనే అభివృద్ధి సాధ్యమని ఎలమంచిలి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. గ్రామంలో ర్యాలీ చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. సభ్యత్వం తీసుకుంటే ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. టిడిపి సీనియర్ నాయకుడు మెరుగు బాబునాయుడు నాయకత్వం వహించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు మేరుగు వెంకటరావు, ధోని కాసుబాబు మేరుగు మహేష్, కొవిరి బంగారయ్య, పాల్గొన్నారు .

**మధురవాడ** : జివిఎంసి ఆరో వార్డు పరిధి ఆర్‌హెచ్.కాలనీలో తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ విచ్చేసి సభ్యత్వాలు అందించారు. అనంతరం కాలనీలో పూర్తి అంగవైకల్యంతో ఉన్న ఈశ్వరమ్మ ఇంటికి వెళ్లి వికలాంగుల పెన్షన్ మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, గరే గురునాథ్, గొల్లంగి ఆనందబాబు, పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన రీజనల్ కాన్ఫరెన్స్

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** స్థానిక సాంప్రదాయ ఫంక్షన్ హాలులో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రీజనల్ కాన్ఫరెన్స్ ఘనంగా ముగిసింది. ముందుగా గజముఖ నృత్య అకాడమీ విద్యార్థులు క్లాసికల్ డాన్స్‌తో ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా సుజాత పరమేష్‌ల సమ్మేళనం నిర్వహించారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. వాసవి వనిత క్లబ్బుల బ్యానర్లతో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్ద బొడ్డేపల్లి వాసవి క్లబ్, నర్సీపట్నం వనిత వాసవి క్లబ్, ఏటిగైరంపేట వాసవి క్లబ్‌లు తదితర క్లబ్ సేవా కార్యక్రమాలను గుర్తించి సత్కరించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి మానేపల్లి రామానుజ రామానంద రమేష్ మాట్లాడుతూ, అశోక చక్రవర్తిని స్ఫూర్తిగా తీసుకొని రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటాలనే ఉద్దేశంతో సీడ్ బాల్స్ ను తయారు చేయడం జరిగిందని తెలిపారు.



సత్కరిస్తున్న రమేష్

సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, అనాథ బాలలకు విద్యా సామగ్రి, బియ్యం, స్కూల్ యూనిఫాంలను పంపిణీ చేశామన్నారు. నిరుపేదలను గుర్తించి నిత్యావసర వస్తువులు, చీరలను పంపిణీ చేశామని అన్నారు. అనంతరం ఆయనను క్లబ్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



తరలి వచ్చిన మహిళలు, పిల్లలు

## ఆలయ ప్రారంభం

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలోని అమలాపురంలో కనకమహాలక్ష్మి, బంగారమ్మ, నూకాలమ్మ అమ్మవారి నూతన ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురోహితులు వేద మంత్రోచ్చారణతో వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు. మహిళలు కలశ పూజలో పాల్గొన్నారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం

### అల్లూరి కలెక్టర్, పిఒ

**ప్రజాశక్తి-పాడేరు :-** కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన గిరిజన విద్యార్థి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ పేర్కొన్నారు. అనారోగ్యంతో వైద్య సేవలో పొందుతూ మృతి చెందిన అరకు వ్యాలీ గురుకుల (పి.వి.టి) పాఠశాల విద్యార్థి బడ్నాయిని ప్రవీణ్ కుమార్ మృతదేహానికి కే జి హెచ్ లో ఆదివారం పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించి ముంచంగి పుట్టు మండలం మాకవరం పంచాయతీ పొల్లిపుట్టు గ్రామానికి అంబులెన్సులో తరలించారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ శాఖ ఇన్ఛార్జి సంచాలకులు ఎల్.రజని శనివారం రాత్రి కేజీహెచ్‌ను సందర్శించి విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయ్యే వరకు అక్కడే ఉప సంచాలకులు అక్కడే ఉండి మృతదేహం తరలింపు ఏర్పాట్లు చేశారు.

# విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి.- విశాఖ కలెక్టరేట్:**నవంబర్ 19,20,21 తేదీలలో నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్ ను ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన జెవివి జిల్లా చెకుముకి సంబరాల్లో ఆవిష్కరించారు.జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చంద్రశేఖరరావు, ప్రొఫెసర్ పద్మ, జెవివి రాష్ట్ర, జిల్లా నాయకత్వం చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జి.ఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ, గత సంవత్సరం బాలోత్సవంలో 6 వేల మంది పిల్లలు 95 స్కూళ్ళ నుండి 74 ఈవెంట్లలో పాల్గొన్నారని, ఈ సంవత్సరం కూడా బాలోత్సవాన్ని సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చేనెల 19,20,21 తేదీలలో జరగనున్న బాలోత్సవంలో గతం కన్నా ఎక్కువ మంది పిల్లలు, ఎక్కువ స్కూళ్ల నుండి పాల్గొంటారని ఆశిస్తున్నామని, ఇందుకు చెకుముకి సంబరాలకు హాజరైన కరెస్పాండెంట్లు, హెడ్మాష్టర్లు, ప్రిన్సిపాల్స్, టీచర్లు తమ సహకారాన్ని అందించి ఎక్కువ మంది పాల్గొనేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు.పెందుర్తి నుండి ఎన్ఎడి కొత్త రోడ్డు వరకూ వున్న స్కూళ్లకు డిసెంబర్ లో ప్రత్యేకంగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి గోపాలరావు, ఉపాధ్యక్షులు, మురళీధర్, జిల్లా నాయకులు ఎస్.వి.కె పరశురామ్,శేషగిరిరావు, లక్ష్మణ స్వామి,రమేష్, ప్రసాద్, కృష్ణారావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


విషాదంలో స్నేహితులు, బంధువులు

## తీరంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

**ప్రజాశక్తి-ఎస్.రాయవరం:**అనకాపల్లి జిల్లా యస్ రాయవరం మండలం రేవుపోలవరం గ్రామ సముద్ర తీరంలో ఇద్దరు విద్యార్థులు గల్లంతయినట్లు మెరైన్ ఏ యస్ఐ కృష్ణ తెలిపారు. కొరుప్రోలు గ్రామానికి పెళ్ళికి వచ్చిన విజయనగరంలో చదువుకుంటున్న విద్యార్థులు పదకొండు మంది రేవుపోలవరం తీరంలో విహారయాత్రకు వచ్చారు. వారిలో ఇద్దరు విద్యార్థులు తుర్ల అర్జున్, బుంగా బబ్లులు సముద్రంలో ఆటలాడుతూ గల్లతయినట్లు వారి స్నేహితులు తెలిపారు. వారి కోసం హుటాహుటిన స్థానిక మత్స్యకారులు, మెరైన్ సిబ్బంది గాలింపు చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక యస్ఐ విభీషణరావు తన సిబ్బందితో కలసి గాలింపు చర్యలు చేపట్టారు. ఇరువురి ఆచూకి లభ్యం కాకపోవడంతో బంధువుల రోదనలతో తీరప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


క్రీడాకారులతో డైరెక్టర్, కోచ్‌లు

## క్రీడాకారులకు ట్రాక్‌ల పంపిణీ

**ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:**ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం ఉదయం ట్రాక్ సూట్‌ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ కె.శ్రీకృష్ణమూర్తి క్రీడాకారులకు ట్రాక్ సూట్లను పంపిణీ చేశారు. విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ డి వి ఎస్ వై శర్మ పాల్గొని త్వరలో గుజరాత్ లో జరగనున్న జాతీయ క్రీడలలో పాల్గొనే క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు, పలువురు కోచులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇటీవల జరిగిన స్టేట్ టోర్నమెంట్ లో సంయుక్త, హార్దిక, మహీధర్, రేణుక, లిఖిత, జశ్విత, అరిఫా సుల్తానా, చరణ్, మణికుమార్, దీక్షిత, విజేతలుగా నిలిచిన విషయం తెలిసినదే.

## ఎపి జిఎన్ఎ రాష్ట్ర కోశాధికారిగా గంగాభవాని

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:**ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా టి.గంగాభవాని ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో విశాఖ జిల్లా నుంచి గంగాభవాని పోటీ చేయగా అత్యధిక మెజార్టీతో గెలిచి ఆమె ఎన్నిక కావడం విశేషం. గంగాభవాని విశాఖ జిల్లా ఎపిజిఎన్ఎ జిల్లా అధ్యక్షురాలుగా కూడా ఇటీవల భారీ మెజార్టీతో విజయం సాధించారు. రాష్ట్రస్థాయిలో విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం ఉండాలనే లక్ష్యంతో ఆమె పోటీ చేయగా కీలకమైన స్థానం లభించింది. గంగాభవాని నియామకం పట్ల విశాఖ జిల్లాకు చెందిన నర్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎం.ఇందిర, కార్యదర్శి జివిఎస్ వరలక్ష్మి, కోశాధికారి వంశీ, విశాఖ జిల్లాలోని పలు ఆస్పత్రిలకి చెందిన నర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గంగాభవాని మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో ఉన్న నర్సింగ్ ఉద్యోగుల సమస్యలను త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు.



# నత్త నడకన జల్లూరు అప్రోచ్ రోడ్డు పనులు

**ప్రజాశక్తి -కోటవురట్ల:**అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ వచ్చిన అప్రోచ్ పనులు ప్రారంభించిన నత్తనడకన సాగుతున్నాయి. 2014లో మొదలుపెట్టిన జల్లూరు వంతెన నిర్మాణ పనులు నేటికీ పూర్తికాక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2014లో నాలుగు కోట్లతో ప్రారంభించిన వంతెన నిర్మాణ పనులు 2018-19 నాటికి స్లాబు పనులు పూర్తి చేశారు. నాటి నుంచి 2024 వరకు ఎటువంటి పనులు చేపట్టక లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి నాళ్లలోనే అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పనులు ప్రారంభించారు. ఆ పనులు కూడా నతనడకనే సాగు తుండటంతో స్థానికులు ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలు సందర్భాలలో ప్రమాదాలు సైతం చోటు చేసు కుంటున్నాయి.

జల్లూరు వంతెన అప్రోచ్ నిర్మాణ పనులకు దాదాపు రెండు కోట్లతో అంచనాలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఆర్భాటంగా పనులు మొదలుపెట్టినా నిధులు మంజూరు కాకపోవడంతో పనులలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. నిర్మాణ జాప్యం కారణంగా వంతెన పై నుంచి ప్రయాణానికి ప్రజలు విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు తల్లిదండ్రులు ఇంటికి చేరేవరకు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుకుంటున్నారు.


నిలిచిన పనులు

## దుకాణంలో గ్యాస్ లీక్

### - తప్పిన ప్రమాదం

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:**మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో ఓ దుకాణంలో గ్యాస్ లీక్ అయ్యింది. ఆ గ్రామానికి చెందిన సంతోష్ అనే దుకాణదారుడు టీ స్టాల్ నడుపు కుంటున్నాడు. టీ చేసే సమయంలో ఒక్కసారిగా గ్యాస్ బండ నుంచి మంటలు ఎగిసి పడ్డాయి. గ్యాస్ బండ నుంచి మంటలు చెలరేగడంతో పక్కన ఉన్న దుకాణదారులతోపాటు స్థానికులు పరుగులు పెట్టారు. స్థానికులు మంటలను అదుపు చేశారు.


సిలిండర్ నుంచి వ్యాపిస్తున్న మంటలు

## కాఫీ బకాయిలు చెల్లించాలి : సిపిఎం

**ప్రజాశక్తి-జి.మాడుగుల:**కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయిలు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. జి.మాడుగుల మండల సిపిఎం ఏడవ మహా సభ గేమ్మెలి పంచాయతీ మహాదేవపురంలో జరిగింది. ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు వనుగు సన్యాసిదొర జెండాను ఆవిష్కరించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2022-2023 సంవత్సరంలో కాఫీ ప్రోత్సాహక నిధులు కాఫీ లబ్ధిదారుల ఖాతాలో వేయలేదన్నారు.కాఫీ రైతులకు అపెక్స్ కమిటీ ప్రకటించిన ధరలతో రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు.పార్చుమెంట్ కు కిలో రూ.500, అరబిక్ చెర్రీ 300, రోబోట్రో చెర్రీ 200 ధర ప్రకటించాలన్నారు. కాఫీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్ ఆర్ .ఈ జీ ఎస్ కూలీలకు చట్ట ప్రకారం రోజు కూలి 300 ఇచ్చి గిరిజన ప్రాంతంలో 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల వచ్చిన తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతులు పండించిన పసుపు, పిప్పళ్ళు, అల్లం, చిక్కుళ్ళు, చింతపండు కు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మండలంలో రోడ్డు, తాగు నీరు, పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై రాబోయే రోజుల్లో ఉద్యమం కొనసాగిస్తామన్నారు.ఈ మహాసభలో మండల నాయకులు. జగ్గందొర, దీన బంధు, వనుగు సన్యాసిదొర, పలసి సంకయ్య, బాణం ధర్మారావు, వంజారి పిన్నమనాయుడు, సత్తిబాబు, గణపతి, మధు, ఈశ్వరమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నేత చిన్నయ్యపడాల్